www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 జూన్ 2024



సచివాలయాల్లో నిలిచిన సర్వర్

విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో సేవలు అన్ని నిలిచిపోయాయి. ప్రభుత్వం మారడంతో సర్వర్లలో మార్పులు చేస్తున్నారు. ఈ పరిణామంతో మీసేవ, సచివాలయాల సేవలు అన్ని నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇకట్లు పడుతున్నారు. కళాశాలాలు, పాఠశాలలు తెరచుకోవడంతో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువ పత్రాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు మీసేవ, సచివాలయాల చుట్టూ కుల, ఆదాయ ధ్రువపత్రాలు దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ, గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికలు కోడ్ అమలోకి వచ్చిన నాటి నుంచి రెవెన్యూ సేవలు ఎన్నికల కారణంగా నిలిచిపోవడంతో ఇటు విద్యార్థులు, అటు రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రయివేటు విద్యాసంస్థల దందా..!

అధిక ఫీజులు వసూలు

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పట్టణంలో ప్రయివేటు విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. దీంతో ఫీజులు కట్టలేక విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని ప్రయివేటు విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. అయితే అదే అదునుగా చేసుకుని ఆయా విద్యాసంస్థలు తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పట్టిపీడిస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఐదో తరగతి విద్యార్థికి ఫీజు రూ.35,000 వేలు ఉంటే పైతరగతులకు ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా జూన్‌లో ప్రతి విద్యాసంస్థల్లో అడ్మిషన్లు జరుగుతుంటాయి. అయితే ఇదే అదునుగా చేసుకుని ప్రయివేటు విద్యాసంస్థలు అధిక ఫీజుల పేరుతో లక్షల్లో సొమ్ము దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



అసలు ప్రయివేటు విద్యాసంస్థలు ఫీజుల పట్టిక కచ్చితంగా అమలు చేయాల్సి ఉన్నా అది ఎక్కడా అమలు కాని పరిస్థితి నెలకొంది. ఎక్కడా కనీసం బోర్డు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఫీజుల పేరుతో దోచేస్తున్నా కనీసం జిల్లా విద్యాశాఖ అధికారులు గానీ, మండల విద్యాశాఖ అధికారులు గానీ అటువైపు చూడకపోవడం గమనార్హం. జిల్లా, మండల స్థాయి అధికారులకు ముడుపులు ముట్టాయని, అందుకే అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ఫీజులతో తమ పిల్లలను ఎలా చదివించుకోవాలో అర్థం కావడం లేదని, పేద, ధనిక అనే తేడా లేకుండా ఫీజుల విషయంలో ప్రయివేటు విద్యా సంస్థలు కఠినత్వాన్ని అవలంబిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై తగు చర్యలు తీసుకుని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజుల భారాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ముదినేపల్లిలో కురుస్తున్న వర్షం

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లి పరిసర గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలకుపైగా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. మండలంలోని వడాలి - చిగురుకోట రోడ్డు, గుడ్లవల్లేరు రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో రోడ్డు కనబడక ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రెండు గంటపాటు కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికీ రైతులు చేల్లో నేరుగా విత్తనాలను వెదజల్లారు. ఈ వర్షంతో ఖరీఫ్ సాగు పనులు మరింత ముమ్మరంగా సాగనున్నాయి.

కలిదిండి : బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరింది. బస్టాండ్ సమీపంలో రాష్ట్రీయ రహదారిపై వర్షపు నీరు చేరడంతో పాదచారులు, ద్విచక్ర వాహన దారులు పలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 90 శాతానికి పైగా ఉన్న చేపల, రొయ్యల చెరువులకు కొంతవరకైనా మేలే జరిగిందని పలువురు ఆక్వా రైతులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితిలో వర్షం పడడంతో వల్ల ఆక్వా రైతాంగానికి మేలు జరుగుతుందని చెబుతున్నారు.

ఉండి: బుధవారం తెల్ల వారుజాము నుంచి మండలంలో భారీ వర్షం పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయంగా మారాయి. ఆర్‌ఒబి ప్రాంతంలో గుంతల్లోకి నీరు చేరడంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిపైకి డ్రెయినేజీ నీరు ప్రవహించడంతో విద్యార్థులు, ఆసుపత్రికి వెళ్లే రోగులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో తెల్లవారుజాము నుంచే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

నరసాపురం : జిల్లాలోని పలు మండలాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్యధికంగా పెనుమంట్ర 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలంలో 1.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భీమవరంలో 48.8, వీరవాసరం 47.2, పాలకోడేరులో 40.4, పాలకొల్లులో 38.4, పోడూరులో 20.6, ఆకివీడులో 19.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆకివీడు : మండలంలో ఎట్టకేలకు బుధవారం ఉదయం వర్షం పడింది. సుమారు రెండు గంటల పాటు వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

పెనుమంట్ర : బుధవారం తెల్లవారుజాము నుంచి మండలంలో ఏకధాటిగా వర్షం పడింది. పెనుమంట్ర మండలంలో ఏకంగా 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెనుమంట్ర పరిసర గ్రామాల్లో ఈదురు గాలులు వీశాయి. వర్షం పడడంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో బుధవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు మెరుపులతో తేలికపాటి వర్షం పడింది. నాలుగు రోజులుగా ఎండ, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు మారిన వాతావరణంతో ఉపశమనం పొందారు. ఈదురుగాలులకు భగ్గేశ్వరంలో చెట్టుకొమ్మలు రోడ్డుపై పడడంతో పాలకొల్లు - భీమవరం మధ్య ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది వెంటనే చెట్టు కొమ్మలు కత్తిరించి తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.

పిడుగు పడి విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

మొగల్తూరు : ఉరుములు మెరుపులతో కూడిన వర్షం బుధవారం తెల్లవారుజామున కురిసింది. వాతావరణంలోని మార్పులు ఒక్కసారిగా మారడంతో ప్రజలు ఆందోళన చెందారు.మొగల్తూరు పంచాయతీ పరిధి అగ్రహారంలో పిడుగు పడటంతో ఆప్రాంతంలోని నివాసాలలోని ఉండే ఫ్రిజ్లు, టీవీలు, ఫ్యానులు తదితర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయ. దీంతో లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆచంట : బుధవారం మండలంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక పక్క ఎండ మరో పక్క వర్షం పడుతూ వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకోవడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఈ వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దమ్ములు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు..!

నిత్యం వందల ట్రాక్టర్లతో మట్టి తరలింపు - అధ్వానంగా రహదారులు - పట్టించుకోని అధికారులు



పెనుమంచిలిలో యంత్రాల ద్వారా తవ్వుతున్న మట్టి

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరి పోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుండడంతో ఆ స్థలాలను పూడ్చడానికి మండలంలోని వరిచేల నుంచి నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల ద్వారా మట్టిని తవ్వి ట్రాక్టర్లపై తరలించి విక్రయిస్తున్నారు. వరి చేల్లోని మట్టిని తవ్వాలంటే రెవెన్యూ, గనుల శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఎటువంటి అనుమతులు లేకుండానే ఇక్కడ నుంచి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఆచంట, కొడమంచిలి, కోడేరు, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లో సారవంతమైన భూముల్లోని వేల ట్రాక్టర్ల మట్టిని తవ్వేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు. ఒక పక్క సారవంతమైన పంట భూములను మట్టితో పూడ్చిపెట్టి లేఅవుట్లు చేస్తున్నారు. అనుమతులు తీసుకోకుండా అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మెరక వరి చేలను పల్లం చేసుకుంటున్నామంటూ రైతులతో దరఖాస్తులు ఇప్పించి తవ్వేస్తున్నారని సరిహద్దు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల ట్రాక్టర్లు అధిక మట్టిలోడుతో రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. ఎక్కువ ట్రిప్పులు వేయడమే లక్ష్యంగా ఈ వ్యవహారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనికితోడు బుధవారం వర్షం పడడంతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మట్టి రహదారిపై పేరుకుపోవడంతో కనీసం ద్విచక్ర వాహనాలు, పాదచారులు ఆ మార్గం గుండా ప్రయాణించడానికి భయపడుతున్నారు.



కరుగోరుమిల్లి పైడివారిపేటలో మట్టితో అధ్వానంగా ఉన్న రహదారి

26న భీమవరంలో రాష్ట్రస్థాయి సెమినార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పర్సా సత్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి సెమినార్ భీమవరంలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కడవరకూ కృషిచేసిన అమరజీవి పర్సా సత్యనారాయణ శతజయంతి కార్యక్రమాల్లో భాగంగా భీమవరంలో కార్మికవర్గం - ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అమరజీవులకు నివాళులర్పించడం అంటే వారి ఆశయ సాధనకు పనిచేయడమేనని తెలిపారు. కార్మిక ఉద్యమంలో కార్మికుల పక్షాన నిలబడి జీవించిన ఎందరో మహనీయులు ఉన్నారని, వారందరినీ స్మరించుకుంటూ సిఐటియు నిరంతరం వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. పాలకుల విధానాల కారణంగా కార్పొరేట్ శక్తులు మరింత శక్తివంతంగా, పేదలు మరింత పేదలుగా మారిపోతున్న నేటి తరుణంలో కష్టజీవులు వారి హక్కులు, చట్టాల రక్షణ కోసం చేస్తున్న పోరాటాల్లో వారికి అండగా నిలబడడం సిఐటియు ప్రత్యేక లక్షణమని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, శ్రామిక జనం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందులో భాగంగానే వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు. ఈ సెమినార్‌కు కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మంతెన సీతారాం, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రసంగిస్తారని తెలియజేశారు. ఈ సెమినార్‌కు ఉద్యోగులు, కార్మికులు హాజరు కావాలని కోరారు.

సకాలంలో నివేదికలు సమర్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌లో దాఖలైన ఫిర్యాదులపై చర్యలు తీసుకొని సకాలంలో నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ లోకయుక్తా, ఎన్‌హెచ్‌ఆర్‌సి, కోర్టు కేసుల పరిష్కార తీరుపై శాఖల వారీగా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఎస్‌టి, ఎస్‌సి కమిషన్ నుంచి అందిన ఫిర్యాదులపై సకాలంలో స్పందించి సమగ్ర నివేదికను నిర్ధేశిత సమయంలో సమర్పించాలన్నారు. ఈ విషయంలో జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సోమవారం నాటికి సంబంధిత కేసుల పురోగతిపై ఆయా అధికారులు నివేదికలు సమర్పించాలన్నారు. అదేవిధంగా లోకాయుక్తా, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సంబంధించిన అంశాలపై కూడా పూర్తి శ్రద్ధ కనబర్చి సంబంధిత నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. వచ్చే వారం నాటికి లీగల్ సంబంధించి అన్ని అంశాలపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలన్నారు. కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి టైం బౌండ్ కేసులు, డైరెక్షన్స్, ధిక్కార, రిట్ పిటీషన్స్‌పై సంబంధించి కౌంటర్ ఫైల్ తదితర చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, డిఆర్‌ఒ డి.పుష్పమణి, ఆర్‌డిఒలు ఎన్ఎస్ కె.ఖాజావలీ, వై.భవానీశంకరి పాల్గొన్నారు.

అభ్యర్థుల తుది ఖాతాలు

వ్యయ పరిశీలకులకు అందుబాటులో ఉంచాలి

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల తుది అక్కౌంట్స్‌ను వ్యయ పరిశీలకులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల ఎన్నికల వ్యయం, ఇతర ఎన్నికల అంశాలపై రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయ ఖర్చుకు సంబంధించి అభ్యర్థి వారీగా సక్రమంగా తుది అక్కౌంట్స్ వ్యయ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ నెలలో వ్యయ పరిశీలకులు జిల్లాకు రానున్నారని, వారు అభ్యర్థుల తుది అక్కౌంట్స్‌ను పరిశీలిస్తారన్నారు. ఈ దృష్ట్యా అభ్యర్థులు అక్కౌంట్స్ పరిశీలన పూర్తి చేసుకోవాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించి తగు సమాచారాన్ని వారికి అందించాలన్నారు. అనంతరం నియోజకవర్గాల వారీగా ఎన్నికలకు సంబంధించిన నిధుల విడుదల, వ్యయం తదితర అంశాలపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ,



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

డిఆర్‌ఒ డి.పుష్పమణి, రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, భవానీశంకరి, కె.భాస్కర్, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్

ర్యాంపుల వద్ద సీసీ కెమెరాలు

24 గంటలపాటు

రెవెన్యూ సిబ్బంది నిఘా

ఐటిడిఎ పిఒ సూర్యతేజ

ప్రజాశక్తి - ఏలూరు/కుక్కునూరు

ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ఇసుక ర్యాంపుల్లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఎం.సూర్యతేజ చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ఇసుక ర్యాంపుల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాచారం, వింజరం, ఇబ్రహీంపట్నంలోని రెండు రీచ్‌లు, రుద్రమకోట గ్రామంలో రెండు రీచ్‌లలో సోలార్ విధానంతో పనిచేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు, రెవెన్యూ సిబ్బంది కూడా 24 గంటల పాటు నిరంతర పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. అక్రమ రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, వాహనాలను కూడా సీజ్ చేస్తామని ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ హెచ్చరించారు.



సీసీ కెమెరా వద్ద రెవెన్యూ సిబ్బంది

గ్రామస్థాయిలో శాంతి కమిటీల ఏర్పాటు

పోలవరం డిఎస్‌పి సురేష్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - టి.నరసాపురం

నియోజకవర్గంలో ఉన్న పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో గ్రామస్థాయి శాంతి కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపడతున్నామని పోలవరం డిఎస్‌పి ఎన్.సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు



మాట్లాడుతున్న డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి

జాగ్రత్త చర్యగా గ్రామ పెద్దలు, అన్ని పార్టీల నాయకులతో కలిసి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఆహ్లాదకరమైన, స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాలను పోలీసులు దత్తత తీసుకుంటారని, తద్వారా ఆగ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. ఇందుకోసం ప్రజల సహకారం అవసరం ఉంటుందన్నారు. గ్రామాల్లో ఇప్పటికే బైండోవర్ కేసులు ఉన్నవారికి ఇకపై మరో కేసు నమోదైతే బైండోవర్లో ప్రకటించిన నగదు వసూలు చేస్తామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఎస్ఐ దుర్గా మహేశ్వరావు ఉన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్ :ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో బుధవారం 11 మంది తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ బుధవారం ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా నివారణ దినోత్సవమని తెలిపారు. సికిల్ సెల్ అనేది జన్యుపరమైన, రక్త సంబంధిత వ్యాధి అని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉంటున్నారన్నారు. పౌష్టికాహారం, వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని కృష్ణారెడ్డి తెలిపారు. తల సేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు భోజనాలు, డ్రై ఫ్రూట్స్‌ను పంపిణీ చేసిన మానవత సభ్యులు పరిమి భాగ్యలక్ష్మి, దేవినేని భాస్కర్‌రావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె. వరప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, రత్నాకరరావు, పరిమి భాగ్యలక్ష్మి, దేవినేని భాస్కరరావు, కెవి.రమణ పాల్గొన్నారు.

నిర్మల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

అభివృద్ధికి సహకరిస్తా : ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలో నిర్మల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో అత్యాధునిక సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ హాస్పిటల్ సేవలను రోగులు వినియోగించుకోవాలన్నారు. అన్ని సదుపాయాలతో హాస్పిటల్ నిర్మించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి సహాయం కావాలన్నా తాను చేస్తానని చెకప్పారు. నిర్మల మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ దగ్గరకు వచ్చిన వికలాంగులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గాన్ని తనదైన శైలిలో అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. నిర్మల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధి కోసం తన వంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బిందుఫిలిప్, సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిర్మల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని, మూడు వారాలుగా చేసిన పనికి డబ్బులు జమ కావట్లేదని, వెంటనే ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీ మేరీ డిమాండ్ చేశారు. మండలంలోని ఉపాధి హామీ కూలీలు ఎండను సైతం లెక్కచేయకుండా జీవనం కోసం పనిచేస్తున్నా డబ్బులు జమ కావట్లేదన్నారు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ కూలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పనికి వెళ్లినా కూడా హాజరు వేయడం లేదని, కొలతలు కూడా సరిగా తీయట్లేదని, కూలీలను చులకన భావంతో మాట్లాడు తున్నా రని, ఇలాంటి సమస్యలు మళ్లీ తన దృష్టికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. వెంటనే పేస్లివ్వాలని, కూలీలు ఎకౌంట్లకు డబ్బులు జమ చేయాలని కోరారు.

బొకేలు వద్దు.. మొక్కలు తీసుకురండి

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

తన కోసం బొకేలు తీసుకురావొద్దని, ఫలోత్పాదక మొక్కలు తీసుకురావాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు. చింతమనేని ప్రభాకర్ నిత్యం తనకోసం దుగ్గిరాల క్యాంపు కార్యాలయానికి వస్తున్న వేలాది మంది నాయకులకు, కార్యకర్తలకు, అభిమాన ప్రజలను ఉద్దేశించి పర్యావరణ పరిరక్షణ జీవకోటికి సహకారం అనే గొప్ప సంకల్పంతో ఒక వినూత్నమైన పిలుపునిచ్చారు. ఇటీవల జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, పలువురు జనసేన నాయకులు, వీర మహిళలు చింతమనేని ప్రభాకర్‌ను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్‌కు చలమలశెట్టి రమేష్ ఒక పండ్ల మొక్కను కానుకగా అందించారు. ఆ పండ్ల మొక్కను ప్రత్యేకంగా నాటి, దాని చుట్టూ ట్రీ గార్డ్ సైతం ఏర్పాటు చేసి సంరక్షించాలని తన కార్యకర్తలకు చింతమనేని ప్రభాకర్ సూచించారు. అంతే కాకుండా ఇకపై తనను కలవటానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు ఎవరైనా సరే, ఒక్క పూటలో వృధాగా పోయే పూలబొకేలు, దండలు, అలాంకారానికి మాత్రమే పరిమితమయ్యే డెకరేషన్ మొక్కలు వంటివి తీసుకురావద్దని, పర్యావరణానికి, జీవ కోటికి ఉపయోగపడేలా పండ్ల మొక్కలను కానుకగా అందిస్తే తాను ఎంతో సంతోషిస్తానని చెప్పారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ నిర్ణయం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

పొలసానిపల్లిలో ముంపు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు



కాలువలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లోతట్టు, ముంపు ప్రాంతాల్లో ముంపు నివారణ కోసం ముందస్తు చర్యలు చేపట్టినట్లు సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. సాధారణంగా ద్వారకాతిరుమల మండలం ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పొలసానిపల్లి గ్రామం మీదుగా భీమడోలు జంక్షన్‌కు చేరుతుంది. ఈ నేపథ్యంలో గ్రామానికి ముంపు బెడద ఉంటుంది. దీనిని గుర్తించిన సర్పంచి ఆధ్వర్యంలోని పంచాయతీ పాలకవర్గం ముంపు నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా మురుగు కాలువలను బాగు చేస్తున్నారు. ప్రవాహాలకు అడ్డంగా ఉండే చిన్నచెట్లు , చెత్తను తొలగించే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. తరచుగా ముంపు బెడద ఎక్కువగా ఉండే బిసి కాలనీలో కార్యక్రమాలు ప్రారంభించినట్లు సర్పంచి తెలిపారు.



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

గూటాలలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో అంగన్వాడీ చిన్నారులకు బుధవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో తరగతికి అర్హత పొందిన విద్యార్థులకు ఎల్ఎన్‌డిపేట సెక్టార్ సూపర్‌వైజర్ మాధవిలత, గూటాల ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ధ్రువపత్రాలు అందించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న ప్రోత్సాహలను తల్లిదండ్రుల సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో గూటాల, కొత్త పట్టిసీమ అంగన్వాడీ వర్కర్స్, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్ట్

జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ఎల్ఎన్‌డిపేట గ్రామంలో మంగళవారం పూజారి జొన్నాడ పేరా స్వామిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు చిక్కాల యేసుబాబు పోలీసులు అరెస్టు చేశారు. జంగారెడ్డిగూడెం కోర్టులో ముందు హాజరు పరిచినట్లు పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. నిందితుడికి 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఏలూరు జిల్లా జైలుకు తరలించాలని మేజిస్ట్రేట్ వారు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు


ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురానికి చెందిన 17 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశారనే ఫిర్యాదుపై చేబ్రోలుకు చెందిన యువకుడు గరగ దుర్గాప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేశామని చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాపు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు బుధవారం నారాయణపురం బాధితురాలి ఇంటికి వచ్చి వివరాలు సేకరించి వెళ్లారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆకలి కేకలతో ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షుడు టిడిఎస్.రాజు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా కోరారు. అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సకల సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కేంద్రాల నిర్వహణలో కేంద్ర పరిధిలోని బాలింతలకు, పసిపిల్లలకు విలువైన పోషకాహారాన్ని అందిస్తూ అంగన్వాడీలు మాత్రం అర్ధాకలితో, ఆర్థిక బాధలతో, సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు తమకు వచ్చే వేతనాల్లో సగభాగంతో నివాసం ఉండే ఇంటి అద్దెలకు చాలక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సుదీర్ఘకాలం అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమ్మె చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం నేతలు అధికారంలోకి వచ్చేది తామేనని తాము అధికారులకొస్తే డిమాండ్స్‌ను ఆమోదించి అమలు చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేసి అంగన్వాడీలను ఆదుకోవాలని కోరారు. సొంత ఇల్లు లేని అంగన్వాడీ వర్కర్లకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి రూ.ఐదు లక్షలతో పక్కా ఇల్లు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని కోరారు.



ఎంఎల్ఎ బాలరాజుతో పాస్టర్లు

ఎంఎల్ఎ బాలరాజుకు పాస్టర్ల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును మండల పాస్టర్ల సంఘం పాస్టర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.జయరాజు, ఇమ్మానుయేలు క్రిష్టోఫర్, రొక్కల మేషెక్ బాబు, నెహెమ్య, టిఎం శాస్త్రి, ఇ.సంపతిరావు, సామ్యూల్, రాజు ప్రకాశ్, డేవిడ్, సువర్ణరాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

వైసిపి మండల యూత్ అధ్యక్ష పదవికి రాజీనామా

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి మండల యూత్ అధ్యక్ష పదవికి, టి.నరసాపురం గ్రామ కమిటీ అధ్యక్ష పదవులకు రాజీనామా చేస్తున్నట్లు టి.నరసాపురానికి చెందిన వైసిపి నాయకులు కన్నం సర్వేశ్వరరావు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వైసిపి మండల నాయకుడిగా పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించిన సర్వేశ్వరరావు తన వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - కైకలూరు

పవన్ కల్యాణ్‌తో డిప్యూటీ సిఎం పదవికి వన్నె వచ్చిందని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక తాలూక సెంటర్‌లో అన్నా క్యాంటీన్ ద్వారా జనసేన ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. పవన్ కళ్యాణ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా పేదలకు ఉచిత భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

ఉషోదయ హైస్కూల్‌లో ఎసి తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఎసి తరగతి గదుల్లో ఎల్‌కెజీ విద్యార్థులు

నారాయణపురం ఉషోదయ హైస్కూల్‌లో ఈవిద్యా సంవత్సరం నుంచి ఎల్‌కేజీ విద్యార్థుల కోసం ఎసి తరగతులను ప్రారంభించారు. అధునాతనంగా నిర్మించిన గదుల్లో పాఠాలు నేర్పిస్తున్నామని ప్రిన్సిపల్, ఫౌండర్ లయన్ గుణ్ణం బుల్లెబ్బాయ్ చెప్పారు. చిన్నారులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఎసి తరగతులను ప్రారంభించారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఆహ్లాదకరంగా గదులు, బెంచీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లంచ్ బ్రేక్ సమయంలో చిన్నపిల్లలు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేలా చేసిన ఏర్పాట్ల పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ తరహాలో ఉషోదయ పాఠశాల ఛారీటీస్‌లో భాగంగా తక్కువ ఫీజులతోనే నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని డైరెక్టర్ గుణ్ణం గీతావాణి వెల్లడించారు. వచ్చే ఏడాది ఫస్ట్ క్లాస్ విద్యార్థులకు కూడా ఎసి తరగతి గదులను నిర్మించనున్నామని పాఠశాల నిర్వాహకులు వెల్లడించారు.

బ్యాకింగ్ లావాదేవీలపై అవగాహన అవసరం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూజివీడు చీఫ్ మేనేజర్ వెంకటమురళి



మాట్లాడుతున్న చీఫ్ మేనేజర్ వెంకటమురళి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రతిఒక్కరూ బ్యాంకింగ్ లావాదేవీల గురించి, డిపాజిట్ ఖాతాల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూజివీడు చీఫ్ మేనేజర్ జి.వెంకటమురళి అన్నారు. నూజివీడు శారద డిగ్రీ కాలేజీలో రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిట్ ఎడ్యుకేషన్, అవెర్నెస్ వర్క్ షాపునకు ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ జి.వెంకటమురళి పాల్గొన్నారు. ఈ వర్క్ షాపు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డెరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్యాంకు ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సుందర్ సింగ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంక్ ఖాతాలు కలిగి ఉండా లని, బ్యాంకు ఖాతాదారులకు అనేక ప్రయోజనాలు కలుగు తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శారదా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అప్పాజీ, పంచాయతీ కార్యదర్శి డి.దేవరాజ్ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఖాతా కలిగి ఉండాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని, బ్యాంకు ఉత్పత్తు లను ఉపయోగించాలని, బ్యాంకింగ్ సేవలను తెలివిగా ఉపయోగించాలని తెలిపారు. ఈ వర్క్ షాపులో రిసోర్స్ పర్సన్లు కొలకలూరి అశోక్, కె.శ్రీనివాసరావు, ట్రైనర్స్ ఎం.ప్రశాంత్, గోపీ పాల్గొన్నారు.

22న నారాయణపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాడేపల్లిగూడెం డిఆర్‌జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నారాయణపురం ఎస్‌ఎఎస్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ కాలేజీ యూత్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నోడల్ రిసోర్సెస్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు, నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో దేశంలో ప్రతిష్టాత్మకమైన 14 కంపెనీలు ఉద్యోగార్థులను ఎంపిక చేసుకోబోతున్నాయని, సేల్స్ ఎగ్జిక్యూటివ్ నుంచి టీం మేనేజర్ వరకు వివిధ రకాల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, రూ.16 వేల నుంచి రూ.65 వేల వరకు జీతం ఉన్న ఉద్యోగాలకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. జాబ్ మేళాలో పేటీఎం అపోల్లో టైర్స్, అప్పెక్ ఫైనాన్షియల్ సర్వీస్, రెడ్డి అండ్ రెడ్డి మోటార్స్, మోహన్ స్పిన్‌టెక్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మ్యాక్స్ సెక్యూరిటీ సర్వీసెస్, ఆపిల్ ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ మొదలగు సంస్థల హెచ్‌ఆర్ మేనేజర్లు నారాయణపురం కళాశాలకు విచ్చేసి ఉద్యోగార్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 22వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకల్లా కళాశాలకు సంబంధిత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో రావాలని, వివరాలకు బివి.రెడ్డి 99 51405034, కొం డా రవి 9491175498, ఎం.ఇందిర 8500067765, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 8886882032 సంప్రదించాలని తెలిపారు.

'నేను బడికి పోతా' లక్ష్యాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భీమడోలు



మాట్లాడుతున్న భీమడోలు ఎంపిడిఒ స్వర్ణలత

భీమడోలు మండల పరిధిలో నేను బడికి పోతా కార్యక్రమం లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలని ఎంపిడిఒ టి.స్వర్ణలత కోరారు. భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నేను బడికి పోతా కార్యక్రమంపై ఆమె బుధవారం సమీక్ష నిర్వహించారు. మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్షా సిబ్బంది హాజరయ్యారు. ఇప్పటివరకు కొనసాగిన బడికి పోతా కార్యక్రమ ప్రగతి, సాధించిన లక్ష్యాలు, కార్యక్రమం విజయవంతం చేయటానికి చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఎంపిడిఒ అంశాల వారీగా సమీక్షను నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు వారిని చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రజా భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల ద్వారా అందుతున్న సేవలు గురించి వివరించాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి వారు కూడా పాఠశాలలో కొనసాగే విధంగా ప్రయత్నాలను చేయాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు కాలేజీల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకవేళ విద్యార్థినులు కాలేజీల్లో చేరేందుకు ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే , వాటిని గుర్తించి తమ పరిధిలో పరిష్కరించి వారు సైతం కాలేజీల్లో కొనసాగే విధంగా ప్రయత్నాలను చేయాలన్నారు. వారు చేసే ప్రయత్నాలకు మండల స్థాయిలో తన అధ్యక్షతన గల మండల టీం సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు.

మంచి విత్తనాలతో మెరుగైన దిగుబడి



రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

కైకలూరు : మంచి విత్తనాలతో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వరహాపట్నంలోని ఆయన నివాసం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై వరి విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. రైతులకు కిలో రూ.ఐదు చొప్పున 30 కిలోలు బస్తాకు రూ.150 రాయితీతో వరి రైతులకు విత్తనాలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతుకి ఐదు ఎకరాల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎప్పుడూ తాను అందుబాటులో ఉంటానని, ప్రతి రైతు ప్రభుత్వం ఇచ్చే పథకాలతో సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత



ముసునూరులో...

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో అంకితభావంతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ముసునూరు ఎంపిపి కొండా దుర్గాభవాని తెలిపారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్‌లో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రంగు ధనలక్ష్మి గాంధీ, విద్యా కమిటీ ఛైర్మన్, టిడిపి నాయకులు రంగు వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు పాశం నాగబాబు, ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ ,వ్యాయామ ఉపాధ్యాయులు వాక నాగరాజు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

చాట్రాయి : జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే చదువొక్కటే మార్గమని ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మోరంపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని, క్రమశిక్షణను అలవర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వి.జ్యోతి, ఎంపిటిసి సభ్యురాలు సోనీ ఆనంద్, ఉప సర్పంచ్ దిరిశాల సత్యనారాయణ, పరసా శ్రీను, గవర వెంకటేశ్వరరావు, చీదిరాల మారేశ్వరరావు, కంచు శ్రీను, చిరగా శ్రీను, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

నారాయణపురం హైస్కూల్‌లో పుస్తకాలు పంపిణీ

ఉంగుటూరు : నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచి దిడ్ల అలకనంద ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావు, హెడ్ మాస్టర్ నాగూర్ మీరాసాహెబ్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు సప్పా వీరబాబు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బుధ వారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని వాడవల్లి స్కూల్లో జరిగిన కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు వీరంకి వెంటేశ్వరరావు, గ్రామ ప్రముఖులతో కలిసి విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత పాఠ్య పుస్త కాలను,నోటు పు స్తకాలు అందించారు. పూర్వ విద్యార్థి సత్య నారాయణ ఆట వస్తువులను విద్యార్థులకు బహుకరించారు.



ముదినేపల్లిలో...

28న ఆలయ భూమి బహిరంగ వేలం

ప్రజాశక్తి - ముసునూరు

బలివే శ్రీ రామలింగేశ్వర స్వామికి చెందిన ఏడు ఎకరాల భూమిని ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నూజివీడు డివిజన్ ముసునూరు మండలం బలివే గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామికి చెందిన ఆర్ఎస్ నెంబర్ 186లో య. ఏడు ఎకరాలు భూమిని కౌలు సాగు చేసుకునేందుకు బహిరంగ వేలంపాట ఆలయం వద్ద ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.



పుట్టినరోజు వేడుకల్లో వక్తలు

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మాజీ ఎఐసిసి అధ్యక్షులు బావి భారత ప్రధాని రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు ఏలూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమన్నారు. భారత జోడో యాత్ర ద్వారా ప్రజల్లో మమేకమై ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని ప్రజా నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన ఆలోచనా విధానాలు దేశ భద్రతకు ప్రతీక అని, రానున్న రోజుల్లో ఆయనను ప్రధానిగా చూడటం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో లంకా రామ్మోహన్, తాళ్లూరి చక్రవర్తి, కొమ్మన సాంబశివరావు, దాసరి రాంప్రసాద్, తీడ సత్యనారాయణ, దండుబోయిన చంద్రశేఖర్, సాదేబాబు ప్రసాద్, నలగట్ల అనిల్, కోసూరి చంద్రకాంతం, కెఎస్ఎన్.మూర్తి, సేవాదళ్ సుబ్బారావు పాల్గొన్నారు.